నేడు మహా పడిపూజ

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో ఈనెల 25వ తేదీన హరిహర సుతుడు అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించనున్నట్లు 18వ పడి గురుస్వామి గుమ్మడి విశ్వనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు పడిపూజ ప్రారంభమవుతుందని అన్నారు. శబరిమల పూర్వ మేల్‌శాంత్రి శంకరణ్ నంబూద్రి, డాక్టర్ ఎస్.రాజు గురుస్వామిల పర్యవేక్షణలో హరిహర నందన్ భజన మండలి ప్రవీణ్‌స్వామి బృందంచే మహా పడిపూజ భజన ఉంటుందని చెప్పారు. అనంతరం అయ్యప్పస్వామికి పల్లకీ సేవ ఉంటుందని అన్నారు. అయ్యప్ప మాల ధారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విశ్వనాథ్ గురుస్వామి కోరారు. పూజ అనంతరం భిక్ష (అన్నదానం) ఉంటుందన్నారు.

27న శ్రీకృష్ణ రాయబార ప్రదర్శన

చిక్కడపల్లి: భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని చోడేశ్వర నాట్య కళామండలి నిర్వహణలో పౌరాణిక పద్య నాటకం శ్రీకృష్ణ రాయబారం ప్రదర్శన జరుగుతోందని నిర్వాహకులు ఏటుకూరి చంద్రకిశోర్, మల్లాది వెంకటరమణ, స్రవంతిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తి, కృష్ణబ్రహ్మానందంతో పాటు శతాబ్ది దాటిన మహనీయులకు ఆత్మీయ సత్కారం చేస్తామన్నారు. ఈనెల 27న సాయంత్రం 6గంటలకు త్యాగరాయ గానసభలో సంబంధిత కార్యక్రమం మొదలవుతుందన్నారు.

అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అంబర్‌పేట: తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రోజ్‌బడ్స్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల జరిగిన పదో ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రోజ్‌బడ్స్ పాఠశాల విద్యార్థులు 30 పతకాలు సాధించి ఓవరల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. పది బంగారు పతకాలు ఆరు సిల్వర్, 14 బ్రౌన్స్ మెడల్స్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులను మంగళవారం బాగ్‌అంబర్‌పేట మల్లికార్జునగర్‌లోని పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.చంద్రశేకర్‌రెడ్డి, కోచ్‌లు బాబులాల్, ప్రేమ్‌చంద్, పీఈటీ హరీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఏకం చేయడమే ఐవీఎఫ్ లక్ష్యం

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకం చేయడమే అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ లక్ష్యమని ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా అంతర్ రాష్ట్రీయ ఆర్యవైశ్యుల మహా సమ్మేళనం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గుప్తా, నాయకులు సత్తయ్య, కృష్ణమూర్తి, ప్రసాద్, రజనీకాంత్, మహిళా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భాగ్యలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'మధురమే సుధాగానం'


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సంగీత విద్వాంసుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ 21వ వార్షికోత్సవ ముగింపు వేడుకలను మంగళవారం శ్రీకృష్ణ మందిర ఆవరణలో అనాథ వృద్ధుల మధ్య జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన 'మధురమే సుధాగానం' భక్తిగీతాల కార్యక్రమం ఎంతో ఆకట్టుకుంది. ప్రముఖ సంగీత విద్వాంసుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి అకాడమీ సావనీర్ ఆవిష్కరించి మాట్లాడారు. కొన్ని సంస్థలు వార్షికోత్సవాన్ని ఏదో ఆడిటోరియం లేదా మందిరంలోనే నిర్వహించడం ఆనవాయితీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి, గాయకులు నందిని, యామిని తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (40) ఉందానగర్–ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పార్సిగుట్టలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, నిర్వాహకులు విజయ్


జెమినీకాలనీలో దుప్పట్లు, కేక్ పంపిణీ చేస్తున్న మైకెల్ తదితరులు

ఏసు బోధనలు అనుసరణీయం


బాగ్‌లింగంపల్లిలో కేక్ కట్ చేస్తున్న పొన్నం అశోక్‌గౌడ్, రాజేంద్రప్రసాద్‌గౌడ్


సెయింట్ ఆడమ్స్ స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న కరస్పాండెంట్ శ్రవణ్


అంబర్‌పేటలోని పల్లవి స్కూల్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

ముషీరాబాద్: ఏసు ప్రభూ వలే ప్రతి ఒక్కరూ క్షమాపణ దయాగుణాన్ని అలవర్చుకొని పేదలకు చేయూతనివ్వాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం పార్సిగుట్టలో విజయ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన చర్చిపాస్టర్‌లతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు అనుసరిస్తూ ముందుకు సాగినప్పుడు శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌ముదిరాజ్, ఆనంద్, కురిపి, దీన్‌దయాల్‌రెడ్డి, భిక్షపతియాదవ్, నందికంటి గోపాల్‌రెడ్డి, సత్యనారాయణబాబు, బంటి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, కేక్‌ల పంపిణీ

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో వేడుకలు ఘనంగా జరిగాయి. ముషీరాబాద్ నియోజకవర్గం డీసీసీ జీఎస్ క్రిస్టియన్ మైనార్టీ కోఆర్డినేటర్ బి.మైకెల్ ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్ జెమినీ కాలనీలో దుప్పట్లు, కేక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.మురళీమోజెస్, ఆర్.అనురాధా మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లిలో వేడుకలు...

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, లీగల్ సెల్ కన్వీనర్ పి.రాజేంద్రప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు బాగ్‌లింగంపల్లిలో ఘనంగా జరిగాయి. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పీవీ నిరంజన్‌రెడ్డి ఎన్నిక చట్టబద్ధమే..

- ప్రస్తుత అధ్యక్షుడు వివేక్ వేసిన నోటిఫికేషన్ చెల్లదు
- వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు నాగభూషణం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడిగా పీవీ నిరంజన్‌రెడ్డి ఎన్నిక చట్టబద్ధమేనని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం అన్నారు. ఈనెల 22వ తేదీన ట్రస్ట్ సభ్యులతో జరిగిన సర్వసభ్య సమావేశంలో నిరంజన్‌రెడ్డిని ఎన్నుకొని అందరూ సంతకాలు కూడా చేశారన్నారు. క్లబ్ బైలాస్ ప్రకారం నిర్వహించిన నిరంజన్ ఎన్నిక చట్టబద్ధంగా చెల్లుతోందని పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య పార్కులో క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, శైలజామోహన్, అంబంటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ... ప్రస్తుత అధ్యక్షుడు ఆర్.వివేక్ ఏకపక్ష నిర్ణయంతో వేసిన ఎన్నికల నోటిఫికేషన్ చెల్లదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల నోటిఫికేషన్ అనేది చెల్లాలంటే సర్వసభ్య సమావేశంలో ప్రత్యేకంగా ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉండగా వివేక్ ఒక్కరే ఏకపక్షంగా నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు.


సుందరయ్యపార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.నాగభూషణం

◆ కొంతమంది ప్రోత్సాహంతో తప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చి క్లబ్ సభ్యులను గందరగోళానికి గురిచేయడం సరైంది కాదన్నారు. కనీసం ముందుగా ఎలాంటి ప్రకటనలు చేయకుండా.. ఓటర్ లిస్టు కూడా ప్రకటించకుండా ఏకపక్షంగా నోటిఫికేషన్ జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. క్లబ్ నిబంధనల ప్రకారం వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు రామానందం సమక్షంలో పీవీ నిరంజన్‌రెడ్డి ఎన్నిక సభ్యుల మద్దతుతో జరిగిందన్నారు. జనవరి 1వ తేదీన ఆయన పదవీ బాధ్యతలు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు పి.రాజు, సభ్యులు టి.సైకిలాబ్‌బాబు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయండి


మార్క్స్‌భవన్‌లో విలీన సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ముషీరాబాద్: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రతినిధులు కోరారు. మంగళవారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో డిసెంబర్ 28న జరిగే సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జె.వి.చలపతిరావు, పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, అరుణ, అనురాధాలు మాట్లాడుదారు. విప్లవకారుల ఐకత్య రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ డిసెంబర్ 28న జరుగుతుందన్నారు. దీనికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ప్రధాన వక్తగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ ఖట్కర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు జి.అనసూయ, భారతీ ఐఎఫ్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి శివబాబు, మల్లికార్జున్, యాదన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి పోడవంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

కాచిగూడ: గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని శ్యామ్‌మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గోవధతో వాటి సంతతి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. వాటి సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. గోవుల సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా గోవధ నిషేధ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. గో సంరక్షణ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యోగి ప్రశాంత్ దాస్‌జీ మహరాజ్, సురేందర్ సురానా, సంజీవ్‌కుమార్, శ్రీనివాస్‌గుప్తా, వినయ్ తివారి, మనోజ్, రామేశ్వర్ మిశ్రా, గోవింద్ ఇండోరియా, ప్రియ, తరణ్‌జిత్ సిత్, భవాని, కిరణ్, నరేష్, రాందాస్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


వీరన్నగుట్ట (శ్యామ్‌మందిర్)లో మాట్లాడుతున్న ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య


సురేఖనాయక్ (ఫైల్)

చిక్కడపల్లి: పెళ్లికి ముందే తనకు ప్రేమికుడున్నాడని పెళ్లి వారు సమాచారం సేకరిస్తున్నారనే విషయం తెలుసుకుని ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్సై మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా సోమారం గ్రామానికి చెందిన భవ్‌సింగ్ కుమార్తె సురేఖనాయక్(23) జవహర్‌నగర్‌లో సాయిప్రియ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటుంది. అయితే ఇటీవల తల్లిదండ్రులు పెళ్లి సంబంధం ఖాయం చేశారు. ఈ క్రమంలో పెళ్లి వారు సురేఖనాయక్‌కు ప్రియుడున్నాడని వివరాలు సేకరిస్తున్నారనే విషయం ఆమెకు తెలిసింది. దీంతో తీవ్ర మానస్థాపానిక గురై హాస్టల్‌లో సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొన ఊపిరితో ఉన్న సురేఖను చిక్కడపల్లి పోలీసులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె మృతి చెందడంతో మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భద్రతకు భరోసా సీసీ కెమెరాలు


ఇంద్రప్రస్థకాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: భద్రత, నేరాల అదుపునకు సీసీ కెమెరాల పాత్ర ఎంతో ఉందని అని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రభుత్వంతో పాటు కాలనీ, బస్తీ అసోసియేషన్‌లు, ప్రజలు వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సూచించారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ వివరాలను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో నేరాలను చేధించడం సులువు అవుతుందన్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చందు, రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పోర్టర్స్‌కు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ఆర్టీసీ పోర్టర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ పోర్టర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మారుతి కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో మారుతీ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 2000 మంది ఆర్టీసీ కార్గో సర్వీసులు పనిచేసే పోర్టర్స్‌కు గత ప్రభుత్వ హయాంలో 10కేజీల సర్వీస్ లోడింగ్ అన్‌లోడింగ్‌కు రూ.10 ఉంటే ఈ ప్రభుత్వం రూ.5కు తగ్గించిందన్నారు. తాము మంత్రి దృష్టికి తీసుకుపోగా రూ.7.5కు పెంచారని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గత ప్రభుత్వంలో ఉన్న విధంగానే 10రూపాయలకు పెంచాలని కోరారు. విశ్రాంతి తీసుకోవడానికి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆశ్రమం కల్పించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్న మాకు ఈ ప్రభుత్వంలో కల్పించలేకపోతున్నారని అన్నారు. ఆర్టీసీ రిక్రూట్‌మెంట్‌లో 10శాతం రిజర్వేషన్ పోర్టర్స్‌కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జె.భాస్కర్, సత్యనారాయణ, కోఆర్డినేటర్ శంకర్, నరేష్, వేణు, అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రియల్ ఎస్టేట్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

ముషీరాబాద్: రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం హామీ ఇచ్చారు. తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు 20శాతం యువత ఉపాధి పొందుతున్న రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఆ దిశగా మీరు చేసే సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగోని ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసయ్య, ఉపాధ్యక్షుడు పెద్దిరాజు, శ్రీధర్, కార్యదర్శులు లక్ష్మణరావు, బొమ్మ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నూతన కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం

ఘనంగా మర్రి సావిత్రీదేవి శత జయంతి

కవాడిగూడ: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి సతీమణి మర్రి సావిత్రీదేవి శత జయంతి ఉత్సవాలు ఇందిరాపార్కులోని రాక్ మెమోరియల్ గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుమారు 200ల మందికి వైద్య పరీక్షలు చేశారు. అదే విధంగా కేన్సర్ స్కీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెగా హెల్త్ క్యాంపు చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ వసుధారాణి, కోఆర్డినేటర్లు రాధాకోడాలి, అలివేలురెడ్డి, డాక్టర్ మురళి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిది డైవర్షన్ పాలిటిక్స్

- ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తున్నా స్పందించని సీఎం
- అల్లు అర్జున్ విషయంలో డైవర్షన్ రాజకీయాలు
- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్


నారాయణగూడలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

కాచిగూడ: రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తున్నా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. మంగళవారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ..విద్యార్థుల మరణాలపై స్పందించని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సినీ నటుడు అల్లు అర్జున్ విషయంలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకు 48 మంది దళిత బిడ్డల ప్రాణాలు పోయాయన్నారు. అయినా అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం దళితుల పట్ల కుల వివక్షేనని అన్నారు. గురుకులాల్లో అనుమానస్పద మరణాలు, ఆత్మహత్యలు జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం, ఎమ్మెల్యేలు, మంత్రులు నోరు మెదపడం లేదన్నారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. సంక్షేమ శాఖ అధికారులు పత్తా లేకుండా పోయారన్నారు. ఈ మరణాలపైన జాతీయ మానవ హక్కుల కమీషన్, జాతీయ ఎస్సీ,ఎస్టీ, మహిళా కమిషన్‌లు తక్షణమే స్పందించి తెలంగాణలోని అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలను సందర్శించి విచారణ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సంధ్య థియేటర్ ఘటనపై మాట్లాడుతూ ప్రజల దృష్టి మరలుస్తున్నారని అన్నారు. మృతురాలి కుటుంబీకులను చికిత్స పొందుతున్న శ్రీతేజని పరామర్శించని ముఖ్యమంత్రి అసెంబ్లీలో మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా పారిపోతున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, రాంచంరద్, మద్దెల ప్రవీణ్‌కుమార్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి

- జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందకిషోర్ యాదవ్


చెప్పల్‌బజార్ బూత్ కమిటీ సభ్యులతో నందకిషోర్ యాదవ్, కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని.. తెలంగాణలో బీజేపీ బలోపేతానికి అవి దోహదపడతాయని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టబోయిన నందకిషోర్‌యాదవ్ అన్నారు. కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్‌లో బీజేపీ బూత్ నం. 205 కమిటీ ఎన్నిక ఎన్నికల ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి సమక్షంలో జరిగింది. బూత్ అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రజలందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమారాణి, నేతలు రమేష్ యాదవ్, కృష్ణకుమార్, శేర్‌సాగర్, సుభాష్ పటేల్, ముత్యాల నర్సింగ్‌రావు, బూత్ కమిటీ సభ్యులు వంశి, శ్రీకాంత్, శేఖర్, లక్ష్మీ, కాశీం, రహీమా, నంద, తదితరులు పాల్గొన్నారు.

బూత్ నంబర్.41 కమిటీ ఎన్నిక..

అంబర్‌పేట: బీజేపీని సంస్థాగతంగా పటిష్టపరిచేందుకు సమష్టిగా పాటు పడాల్సిన అవసరం ఉందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని భరత్‌నగర్ పోలింగ్ బూత్ నం.41 కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన విచ్చేసి ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీని ఆనంద్‌గౌడ్ అభినందించారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా రామకృష్ణ, కార్యదర్శిగా వెంకట్‌రమణ, కమిటీ సభ్యులుగా సంధ్య, ప్రవీణ్‌కుమార్, మహేశ్ కుమార్, నర్సింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎడెల్లి అజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు చూక్కజగన్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు ఈఎస్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి..

చిక్కడపల్లి: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో బూత్ కమిటీల నియామకం పూర్తి చేసిన బూత్ అధ్యక్షులను ఆయన అభినందించారు. ఆదివారం సాయంత్రం బూత్ నంబర్.271 కమిటీల నియామకం పూర్తి చేసిన బూత్ అధ్యక్షుడు సురేష్ రాజును డివిజన్ బీజేపీ శ్రేణులతో కలిసి శాలువా కప్పి అభినందంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, సత్తిరెడ్డి, నవీన్‌కుమార్, ప్రశాంత్, స్థానికులు కృష్ణచారి, ప్రదీప్, అలి తదితరులు పాల్గొన్నారు.


భరత్‌నగర్‌లో బూత్ కమిటీతో మోర్చా రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్


బూత్ అధ్యక్షుడు సురేష్ రాజును సన్మానిస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్